తోడు నీడ

★

శ్రీ వెంపటి సచ్చిదానందశర్మ

ఇది సిసలైన సత్యం; నమ్ము—ఉట్టి తెల్లకాగితాన్ని చదవటానికి ప్రయత్నిస్తున్నావు నువ్వు.

కళ్ళముందుకి పత్రికని ఇంకా జరిపినందువల్ల ప్రయోజనం లేదు; గుడ్లు పత్తికాయలల్లే చేసి మరింత తేరిపార జూచినందువల్ల కూడా ప్రయోజనం లేదు.

పోనీలే, ఇప్పుడు గాకపోతే తరవాతనైనా ఒప్పుకుంటావు— నేను చదవబోయింది తెల్లకాగితాన్ని—అని.

—ఈ మాటలకి నేనూ పదింతలు విభ్రాంతిపడ్డాను. కథ ఉండక ఏమైపోతుంది? ఫలానా పేజీలో బావగారు ఆఘోరించిన కథ ఉంటుందని విషయసూచికలో చూచానాయె—లైట్లు వెలుగులో...

'కాదు. చీకట్లో'

'అబద్ధం! కళ్లు మిరుమిట్లుగొలిపే విద్యుద్దీప కాంతిలో...' రెట్టించాను ఆవేశంతో, ఈ మాటలు ఎవరితో అంటున్నానో విచారించే సావకాశం కూడా లేకుండా.

'నిజం...కటిక చీకట్లో...'

నేను నమ్మలేదు.

'ఔను. ఆ కథ నేను వ్రాసి ఉండవలసింది; కాని, వ్రాయటం పడకనే పోయింది...'

'ఎందుకని?' అన్నాను బావవైపు చూస్తూ.

'ఈ లోపలే చనిపోయాను'

అంత మనిషి ఎదురుగా కనిపిస్తూ నమ్మమని ఈమాట లనేసరికి బావని చూచి పక్కున నవ్వ బుద్ధిపుట్టింది. కాని, మళ్లా ఒక అనుమానం వచ్చింది—ఈ మాట లన్నది బావేనా—అని.

బావ పెదవులు కదిలినట్లు లేవు.

'నిజం. ఆత్మహత్య... నేనే చంపాను.' ఈ మాట లంటున్న దెవరని ఒక్కసారి వెనక్కి తిరిగాను. ఎవరూ లేరు.

'మరి నువ్వెవరు?' అన్నాను శూన్యంతో.

'నేనా?...వాడి ఆత్మని...'

ఇంకా అనుమానం తీరక బావ దేహాన్ని గట్టిగా కుదిపాను. నేను పట్టు వదిలేసరికి బావ దేహం లుంగగా కింద కూలిపోయింది.

'అనుమానం తీరిందా? నిజం... చచ్చి సాధించదల్చుకున్నాను...'

అప్రయత్నంగా ఇటు తిరిగాను. గదిలో మరెవరి అలికిడి లేదు. నేనేమి చూస్తున్నానో నాకే తెలీదు. గదితలుపులు గాలికి రెపరెప లాడినై. ఒక స్త్రీ మూర్తి గాలిలో కొట్టుకొచ్చింది.

అక్కయ్య!—

'నిజంరా తమ్ముడూ! బావ సాధించటానికే చనిపోయాడు—జీవితంలో నా సహచర్యం లభ్యం కాకపోతే చచ్చి దయ్యమై పొందుతాననేవాడు ఎప్పుడూ నాతో...' అక్క ఆత్మ మాట్లాడుతోంది అల్లంత దూరాన్నుంచి.

'పోనీ, దయ్యమైపడితే పట్టేవాడేమో...అన్నంత మాత్రానికే నువ్వు కూడా చచ్చిపోవట మెందుకే?' అన్నాను బిక్కగా.

'ఎన్నాళ్ళని ఈ ఆత్మవంచన? అందుకే చేశాను—ఆత్మహత్య...' అంది తీవ్రంగా.

'అసలు, ఆత్మవంచ నెందుకు చేసుకోవలసి వచ్చింది?'

'చేసుకోరాదు; కాని, చేసుకునేదాన్ని. ఎందుకు చేసుకునేదాన్నో నాకే తెలీదు' అంది పొరపడి విచారించటం తప్పితే తను చేయగలిగిందేమీ లేనట్లు.

ఏదో తెలీని సంతృప్తి పొందాను ఈ మాటలవల్ల. పదిమంది ముద్దాయీలలో కూర్చున్నప్పుడు నేరస్థుడు పొందే సంతృప్తి ఇటువంటిదే కావచ్చు. నిజానికి, ప్రాపంచిక దృష్ట్యా నా ప్రవర్తన నిరాక్షేపణీయం.

కాని, నన్ను కూడా చంపెయ్య మంటున్నా రెవరో...

'అన్నయ్యా! బావని కూడా చంపెయ్యరా...ఇన్నాళ్లూ కబుర్లతో కడుపునింపి, అన్నీ మరిచిపోయినట్లు ప్రవర్తిస్తున్నాడీ మనిషి...'

మాటలు వినిపించిన మరుక్షణానికి మరో స్త్రీ దేహం కూడా కొట్టుకొచ్చింది గదిలోకి.

"చెల్లాయ్! నువ్వు కూడా చనిపోయావుటే!' అంది బావ ఆత్మ.

'ఔనురా అన్నయ్యా! బావ చేస్తున్న మోసాన్ని తెలుసుకోటానికి చనిపోయాను...బావనికూడా చంపెయ్యరా...'

అన్నా చెల్లెళ్లిద్దరూ నన్ను చంపి తీరుతారని భయపడ్డాను.

'నే నేమీ మోసం చెయ్యలేదు' అన్నాను, ఎన్నడూ తొందరపడి నోరుజారి ఉండనందుకు సంతోషిస్తూ.

* 'నీ', 'నా' ఉనికి *Existentialism* దృష్ట్యా ఇది. 'మన' బింబాలు, ప్రతిబింబాలు 'వీళ్లు', 'వాళ్లు'...

'అబద్ధం......నిన్ను నువ్వు మోసం చేసుకుంటున్నావు. మొన్న మనం పార్కునుంచి తిరిగొచ్చాక పుస్తకం పుచ్చుకుని చదువు నటిస్తూ ఏమాలోచించావో చెప్పు!'

'నేనే మాలోచించానో నీకెలా తెలుసు?' అన్నాను.

'తెలుసుకోటానికి వీలవుతుంది గనకనే చనిపోయాను. ఇక్కడ అనుకోవటానికీ అనటానికీ తేడా లేదు.'

'లాభం లేదురా తమ్ముడూ! ఇక్కడ రహస్యాలంటూ లేవురా. నా మాట విని నువ్వుకూడా చనిపో' అంది అక్క.

'వదినా! పోనీ, నువ్వే చెప్పు, మొన్న నే మాలోచించాడో బావ!'

'నిజమే. అసలు వాడి కెప్పుడూ నీధ్యాసే! మొన్న కాఫీ హోటల్లో, నిన్న సినిమాహాల్లో, ఇందాక ఇంటికి వస్తూ......' అక్కయ్య ఏదో పుస్తకంలోనుంచి చదువుతున్నట్లు ఏకరువు పెడుతోంది.

'అన్నయ్యా! మరి, బావని కూడా మనలోకి రప్పించెయ్యరా...చంపెయ్యరా'

బావ అమాంతం నా పీక నలిపేస్తాడేమో ననుకున్నాను. మాటలైతే వినగలను గాని, ఆకారంలేని ఆ వ్యక్తి తీరా పీక పిసికే దాకా తెలియరాదు...

'ఒకళ్లు చంప నవసరం లేదు వాణ్ణి...ఆత్మవంచన చేసుకున్నాడుగా. ఆత్మహత్య కూడా చేసుకు తీరుతాడన్నమాటే...' బ్రహ్మ వాక్యంలాగా పలికింది బావ అత్త.

బావ ఈ మాట లంటుండగానే 'మాశావుట్రా తమ్ముడూ! ఇక్కడి మనస్సులో అనుకునే విషయాలకి తప్పితే, నోటి మాటలకి విలువలేదు. నిజానికి, ఇక్కడే చాలా బాగుందికదూ?' అంది అక్క పశ్చాత్తాపపడుతున్నట్లు.

'నిజమే...ఏమో అనుకున్నాను గాని, ఇక్కడే చాలా హాయిగా ఉంది...' నేను గూడా కాదనలేకండా ఉన్నాను. ఒక్కసారిగా నా మాటలు ఆగిపోయినై.

నా శరీరం కూడా అల్లంత దూరాన పడిఉంది.

నే నెప్పుడు ఆత్మహత్య చేసుకున్నానో నాకే తెలీదు.

దూరంగా—రెండు రెళ్లు నాలుగు శరీరాలు!

'తమ్ముడూ! ఇప్పుడు నువ్వేమాలోచిస్తున్నావో చెప్పనా? ఆ శరీరాల్లో బంధింపబడి ఉన్నంతకాలం, నమ్మి నమ్మించి బ్రతికింది క్షణంసేపు కూడా లేదు; ఇప్పటికైనా బైటపడ్డాం. చాలు-అని సంతోషిస్తున్నావు. నిజంగా కూడా అంతేరా. పాడు బతుకులు......' అంది అక్క.

మనసుకి దాపరికశక్తి లేకపోవటం విడ్డూరంగానే ఉంది.

'నువ్వు మాత్రం? నువ్వేమాలోచిస్తున్నావో చెప్పనా?—బావని గురించి!' అన్నాను.

'ఒస్! ఇంతేకదా! అది బావకే తెలుసు! మరి—నువ్వెవరిని గురించి ఆలోచిస్తున్నావో...' అక్క వాక్యం పూర్తిచెయ్యలేదు.

'వదినా! బావ ఎవరిని గురించి ఆలోచిస్తున్నాడో నాకు తెలుసు!'

నలుగురమూ పగలబడి నవ్వాం; ఒకళ్ళ నవ్వు నందుకుని మరొకళ్ళం దిక్కులు పిక్కటిల్లేటట్లు నవ్వుతున్నా మింకా...

అప్రయత్నంగా మా అందరి నవ్వులూ ఒక్కసారిగా కట్టుబడ్డై—దూరాన్నుంచి ఇంతకింతలుగా నవ్వులు వినవస్తున్నై.

ఒక్క క్షణంపాటు అంతా నిశ్శబ్దంగా గడిపాము.

'ప్రతిధ్వను లేమో!' అన్నాను.

'కాదు బావా! ఎవరో ఇటే వస్తున్నట్లు ఆ నవ్వు లింక దగ్గరౌతున్నై.'

'ఎవరో నాకు పరిచయస్థుల గొంతులే......ఎవరబ్బా?' అన్నాడు బావ.

'పరిచయస్థులే కదా......బతుకుజీవుడా!...సగం భయం తీరింది' అంది అక్క.

ఎవరో వస్తున్న సవ్వడి మరింత దగ్గర పడుతోంది. ఖులాసాగా కబుర్లాడుతూ, కేరింతలు కొడుతూ వస్తున్నారు.

'అబ్బ! బతికి బతికి ప్రాణం విసికింది. ఇదుగో వదినా! వీళ్లంతా ఇక్కడున్నారు!' అంది ఒక స్త్రీ గొంతు.

మేము నలుగురం నిశ్శబ్దంగా ఉన్నాం.

'ఉస్! వాళ్లింకా మన్ని గుర్తుపట్టినట్లు లేరు. దగ్గరగా మాట్లాడకు.' మరొక స్త్రీ కంఠం మందలిస్తోంది.

మే మెవరం మాట్లాడలేదు.

'అలా బిక్క పోతా వేరా? మరిచిపోయావా మమ్మల్ని?' బావని ఎవరో నిగ్గదీస్తున్నారు.

'ఏదో లీలగా ఉంది తప్పితే పూర్తిగా గుర్తు రావటం లేదు' అన్నాడు బావ మందంగా.

'మాడరా బావా! అప్పుడే మరిచిపోయాట్ట! రోజుల తరబడి పీడి ధ్యాసంతా మనపైనే ఉండేనుకదా...' అంటున్నాడు మరొకడు రెండవవాడితో.

'నాధ్యాస మీపైనా! అసలు మీరెవరు?' అన్నాడు బావ అయోమయంగా.

'ఎవరని చెప్పమంటావు? అంతా ఆలోచించి, తీరా, నామరూపాలివ్వకుండానే మమ్మల్ని వదిలేస్తివాయ్...' అంటున్నాడు మొదటివాడు.

ఇంతలో, అక్కయ్య దేహం నిద్ర లేస్తున్నట్లు లేస్తోంది.

'అక్కా!' కేక వేశాను.

అక్కయ్య నవ్వుతుంది నా పక్కనుంచి.

'నువ్విక్కడే ఉన్నావే' అన్నాను.

'ఔనురా! నా శరీరంలో మరొక జీవరో ప్రవేశించి ఉంటారు.' అంది కళవికళపడుతూ.

క్రమంగా మా శరీరాలన్నీ లేస్తున్నై.

నా ఒళ్లుకూడా విరుపులు ప్రారంభించింది.

'ఏయ్! ఎవరునువ్వు? అది నా శరీరం... ముట్టుకున్నావంటే నా!' గదమాయించాను నా దేహాన్ని, అందులో ప్రవేశించిన వాడి నుద్దేశించి.

'నీకేమిటోయ్! నీకేవీ లేదిక్కడ...' నా శరీరం నన్ను ధిక్కరిస్తోంది.

'ఎవరు నువ్వు?' అన్నాను.

'నేనా? శివుణ్ణి!'

'అది నా పేరు...' అన్నాను ఆశ్చర్యపోతూ.

'నీ పేరు పెరిగిపోయింది. ఆ పేరు నాది; సుఖంగా బ్రతకాలని తాపత్రేయ పడుతున్న వాణ్ణి నేను. సవ్యంగా బ్రతికలేక చనిపోయిన వాడివి నువ్వు. నీకిప్పుడు నామరూపాలు రెండూ లేవు. మీ అందరికీ కూడా అంతే! ఇప్పుడైనా గుర్తించు మేమెవరో, మీరెవరో — ఇదుగో వీడు మా బావ శేఖరం, ఇది మా అక్క — దుర్గ; ఇది నా భార్య — సీత, సరే, నేనెవరో చెప్పనే చెప్పాను గదా!' అన్నాడు శివుడు.

మా శరీరాల్లో ప్రవేశించి, మా పేర్లు పెట్టుకుని మమ్మల్ని వాళ్లెదిరిస్తుంటే మేము నలుగురం చూస్తూ ఉండిపోయాం.

నిజమే మాకిప్పుడు నామరూపాలు రెండూ కరువైనై—

'ఇప్పుడు మేము సజీవులం! నీ మనస్సులో నీడలులాగా మెదిలి, నువ్వు మామీద దయదల్చి మా కథ వ్రాస్తే..., ఏ కొద్ది మందో మామీద దయతల్చి రవ్వంత మా కథ చదివే శ్రమ తీసుకుంటే వాళ్ల మనస్సుల్లో తిరిగి నీడలులాగా మెదలవలసిన ఖర్మ మాకిప్పుడు లేదు. నువ్వు మాకథ వ్రాయనందుకు మా అందరి ధన్యవాదాలు. ఇప్పుడు మేము నీ పాత్రలం కాదు; మనుష్యులం...' అన్నాడు బావ శరీరంలో ప్రవేశించిన వ్యక్తి బావతో.

వాళ్లు నలుగురూ ఒక్కసారి అతి వినయంగా తలలు వంచారు.

నామరూపాలు లేకపోవటంవల్ల వాళ్లు ఎంత నరకం అనుభవించారో, ఇప్పుడు మేము ఎంత అనుభవించాలో విప్పిచెప్పినట్లయింది.

అంతా ఒప్పుకున్నాం.

మాకు నామరూపాలు లేవు; కావాలి—

'పోనీ మమ్మల్ని నీకథలో పాత్రల్ని చేసి రవ్వంత శరణం యివ్వు' బావ శేఖరాన్ని దీనంగా వేడుకుంటున్నాడు.

'తీరిక లేదు. కథ వ్రాయటానికయే కాలాన్ని కూడా మేమంతా కలిసి గడుపుతాం, కులాసాగా' అన్నాడు శేఖరం.

వాళ్లు నలుగురూ నవ్వారొకసారి.

'పోనీ, శివుడూ! నువ్వన్నా చెప్పరా మీ బావతో, మా కథ వ్రాయమని' అన్నాను.

'నేను చెప్పను. ఏం? నువ్వు చెప్పావేం, మీ బావతో... మా కథ వ్రాయమని!' వాడు నా మాట అసలు వినేట్టు లేదు.

మేమంతా బ్రతిమాలాము—దుర్గ, సీత కూడా శేఖరానికి చెప్పేట్టు లేరు, వాళ్ళ పంతోవమే వాళ్ళకి తప్పలే.

తులబరించుకుని మా దగ్గరనుంచి వెళ్ళిపోవటానికి లేచారు వాళ్లు నలుగురూ. మేమూ వెంటపడ్డాం. వేడుకుంటూ.

పండగ రద్దీతో బజారంతా కళకళ్లాడుతోంది. వాళ్లు నలుగురూ కేరింతాలు కొడుతూ బజారులో కొట్లన్నీ గాలిస్తున్నారు

'వదినా! ఈ చీర చాలా బాగుందికదూ?' అంది సీత ఉత్సాహంగా, నల్లజరీచీర తీసి చూస్తూ.

'చాలా బాగుంది. నల్లజరీచీరంటే నా కెంతో ఇష్టం!' తన కెంత ఇష్టమైనా దుర్గ కళ్లు పెద్దవి చెయ్యటంలో తెలియజేసింది.

—వాళ్ళ ధ్యాస మాపైనే లేదసలు.

'చూడు వదినా! ఆ చీరలు వాళ్ళు కొనేసుకుంటారల్లే వుంది.'

'ఏమో! మనం కొనుక్కోవాలని ఎంతో అనుకున్నాం' అక్కయ్య సమాధానం చెప్పింది దిగులుగా.

ఇంతలో శివుడి దృష్టి నాకు నచ్చిన సూటుమీద పడ్డది. ఒక్కసారి నా గుండె దిగజారినట్లనిపించింది. సూట్ చాలా బాగున్నదంటూ మద్దతిస్తున్నాడు శేఖరం శివుడికి.

'అది వీళ్లు కొనేసుకునేట్టున్నారు' అన్నాడు బావ దిక్కగా.

నాకూ అనుమానంగానే ఉంది.

కొట్లోనుంచి అంతా బైటికొచ్చాం.

వాళ్ళకి నచ్చిన గుడ్డల్ని గురించి అదే పనిగా మాట్లాడుకోవటం మొదలు పెట్టారు వాళ్లు.

మా ఆలోచనలన్నీ కూడా ఆ బట్టలపైనే ఉన్నై. కాని రూపురేఖ లేలేని మాకు బట్టల కోరికేమిటి? మాట, పలుకు లేకుండా వాళ్ళ ననుసరించాం.

శేఖరం మమ్మల్ని పూర్తిగా మరిచిపోయాడు—

—వాడి మనస్సంతా కొట్లో చూసి వచ్చిన బట్టలమీద ఉంది. పండగపూట కొత్తబట్టలు కొనుక్కోటంలో ఎంత ఆనందం ఉందో కొనకుండా కూర్చుని తెలుసుకో గలుగుతున్నాడు. షాపులో బట్టలు మరోకసారి శేఖరం కళ్ళలో మెదిలినై. కొట్లో ఎవరైనా అడుగుపెట్టగానే వాళ్ల దృష్టిని అవ్వే ఆకర్షించి తీరుతాయనుకున్నాడు. తనకోసం వాటిని వేరే దాచిఉంచమని చెప్పనన్నా చెప్పానుగా దనిపించింది.

కాని, తన దగ్గరున్నది అంతా లెక్కిస్తే యాభైరూపాయలు!—గట్టిగా ఒకరికి బట్టలుకొనటానికి సరిపోవచ్చునేమో...

కుర్చీలో పడుకుని ఇంటికప్పువైపు చూస్తున్నవాడల్లా తల తిప్పాడు.

దుర్గ కిటికీముందు నిలబడి బైటికిచూస్తూ ఉంది. ఏదో తీక్షణంగా ఆలోచిస్తున్నట్లుంది. ఆ ఆలోచనలని భగ్నం చేయరాదనుకున్నాడు శేఖరం.

తను దుర్గవైపే చూస్తూ కూర్చున్నాడు. తను కొనాలనుకున్న చీరకట్టుకుని దుర్గ కిటికీముందు నిలబడ్డట్టు భ్రమించాడు శేఖరం. ఎంత బాగుంటుందో—అనుకున్నాడు. మళ్లా, శేఖరందృష్టి చెదిరిపోయింది. జల్లజరీచీర షాపులో బీరువామడతల్లో కనిపించింది.

శేఖరం దుర్గదగ్గరకు నడిచాడు. దుర్గ గమనించలేదు.

'ఏమిటి ఆలోచిస్తున్నావు?' అన్నాడు శేఖరం.

దుర్గ తడబడి, అర్ధరహితంగా 'ఏమీ లేదు' అని, తనింతవరకు ఏమి ఆలోచిస్తున్నదో అప్పుడు ఆలోచించి చెప్పబోయింది. 'మీకో మాటు వచ్చిందికదూ' అంది చివరికి.

'ఔను' అన్నాడు శేఖరం చిరునవ్వు నవ్వి దుర్గ కళ్ళలోకి చూస్తూ.

'నిజం. చాలా బాగుంది. ఇవ్వాళ తప్పకుండా కొంటానని మాటివ్వండి...' కొంటే ఉండే సంతృప్తి, కొనకపోతే ఉండే అసంతృప్తి ఇంతింతలై బ్రహ్మాండగా వినిపిస్తున్నై ఆ గొంతులో.

'అలాగే' అని మాత్రం అని అక్కడినుంచి నడిచాడు శేఖరం.

'అలాగే. అంటే కాదు. మీ దగ్గిరున్న డబ్బు పెట్టి కొనెయ్యాలి. లేకపోతే ఒట్టు!' అంది దుర్గ, వెళ్ళిపోతున్న శేఖరంతో.

దుర్గ తన చీర మాట ఎత్తదేం?—శేఖరం నడుస్తూ ఇదే ఆలోచించాడు. తన బట్టలవిషయం దుర్గ మాట్లాడి, దుర్గ చీరవిషయమై పడదగ్గ విచారమంతా తనకు వదిలి వేసిం దనిపించింది శేఖరానికి.

ప్రాణాలకైనా కురువబెట్టి దుర్గకి ఆ చీర కొనాలనుకున్నాడు శేఖరం.

పర్సులో చూస్తే, ఉన్నాయని తనింతవరకూ సంతృప్తిపడుతున్న యాభై రూపాయలు లేవు. నిలువునా నీరైపోయాడు శేఖరం. తన పెట్టె పుస్తకాలు అన్నీ గాలించాడు పిచ్చిగా. లాభం లేకపోయింది. తను తిరిగిన తిరుగుడికి డబ్బు ఎక్కడ పోగొట్టుకున్నాడో తెలుసుకోవటం దుస్సాధ్యం.

శేఖరానికి మతిపోయినట్లయింది. ఎక్కడని వెతకటం? కాలు గాలిన పిల్లిలాగా ఇల్లంతా తిరిగాడు. పైగా, తను పడుతున్న కలవరం దుర్గకి తెలియరాదు. కొత్త చీర తెచ్చెప్పుడు కట్టబెట్టాడో తెలీనంతగా దుర్గని ఆశ్చర్యపర్చాలని శేఖరం ఉబలాటం.

శేఖరం కుర్చీలో కూలబడ్డాడు. గదిలో తను కెళ్ళగించని చోటు అంగుళం మేరకూడా లేదు. ఎదురుగా ఉన్న దుర్గ బట్టల పెట్టె పైకి పోయింది శేఖరం దృష్టి. ఆ పెట్టె ఒక్కటే మాత్రం తను వెతకలేదు.

పూర్వం ఎన్నడూ తనా పెట్టె తెరిచి ఎరగడు; అవసరం లేదు కూడాను. పెట్టె తాళం లేకుండానే ఉండేది—తాళం వెయ్యవలసినంత భయం దుర్గకి కాని, తాళంతీసి చూడవలసినంత అనుమానం శేఖరానికి గానీ లేవు.

ఇప్పుడా పెట్టె తెరిచి చూడాలనే ఆలోచన రాగానే భయంతో వెన్నులో చిన్న చలి ప్రారంభించింది.

ఇంతలో, గదిలోకి దుర్గ ప్రవేశించింది. శేఖరం దృష్టి మరల్చాడు కళవళపడుతూ. దగ్గరకు వచ్చి నిలబడి చెయ్యి చాచి 'మిమ్మల్ని నమ్మిం దెవరు...ఆ డబ్బిలా ఇచ్చేయండి. నేనూ మీతో బజారు వెడతాము ఆనక' అంది.

'అక్కర్లే...ఎందుకు......నేనే తెచ్చుకుంటాను' పదే పదే అన్నాడు శేఖరం, ఇవ్వటానికి గాని, తెచ్చుకోవటానికి గాని తన దగ్గిర డబ్బు మాయమైందని లోలోపల విచారిస్తూ.

'సరే, మీ యిష్టం. మీరే తెచ్చుకోండి. పోనీ, తెచ్చుకున్నాకనైనా చూపిస్తారా? లేకపోతే, తొడుక్కున్నాకనైనా చూడకపోము!' అని వెళ్ళిపోయింది దుర్గ, అట్టే బలవంతం చెయ్యటం తన కిష్టంలేనట్లు.

దుర్గ చాలా ఉత్సాహంగా ఉంది. తను బట్ట కొనుక్కోదల్చుకోలేదని దుర్గ పసికట్టెయ్యటమే ఈ ఉత్సాహానికి కారణమేమో ననుకున్నాడు. తనమీద ఈ అనుమానంకొద్దీ డబ్బు దుర్గే దాచిఉంటుందనికూడా అనుకున్నాడు శేఖరం.

శేఖరం దృష్టి మళ్ళీ ఒకసారి దుర్గ బట్టలపెట్టెపైకి మళ్లింది. ఎన్నడూ లేనిది ఇవ్వాళ భద్రంగా పెట్టెకు తాళం వేసింది! ఎంత అమాయకంగా పట్టుబడిపోయిందో—అని నవ్వుకున్నాడు శేఖరం. తాళంచెవి ఎక్కడ దాస్తుందో తనకు తెలుసు—టాయ్‌లెట్ బాక్సులో!

పెట్టె తెరిచి మూటిగానే పసికట్టాడు కావలసిన వస్తువెక్కడుంటుందో— పెట్టె ఎడమవైపు అట్టడుగు చీర మడతలో. అనుకోని విధంగా ప్రవర్తించి ఎదటివాళ్ళని మభ్యపెట్టాననే లౌక్యం తెలియని అమాయకురాలు దుర్గ అనుకున్నాడు శేఖరం.

ఐదు పది రూపాయిలనోట్ల దొంతి!

దుర్గ పెట్టెలో డబ్బు మాయమైన సంగతి గ్రహించేలోపలే తను పోయి చీర కొనుక్కురావా లనుకున్నాడు శేఖరం.

దుర్గ మరింత ఆశ్చర్యపడకమానదు!

శేఖరం హుటాహుటిగా బజారు చేరుకున్నాడు. దారి పొడుగునా తను కొనబోయే చీర సింగారించుకుని వన్నె చిన్నెలతో దుర్గ శేఖరం కళ్ళలో మెదులుతోంది. క్షణంసేపట్లో తను చీర ఎలాగూ కొంటాడు. ఆ చీర కట్టుకుని, ఇంతకు పదింతలు మురిసిపోతూ దుర్గ తనముందు ఎలాగూ నిలబడుతుంది.

'ఒరే! బావా!!'- శివుడి రెండోపిలుపు కాని శేఖరం చెవి కెక్కలేదు.

శేఖరం తృళ్ళిపడ్డాడు.

'ఏమిట్రా అంత పరాకు! ఎక్కడికి ఇంత విసురుగా వెడుతున్నావు'

శివుడి రెండో ప్రశ్నతో శేఖరం పగటికలలన్నీ పటాపంచలైనై.

'ఇక్కడికే గాని, నువ్వెక్కడికి?' ఎదురు ప్రశ్నించాడు శేఖరం, తనింతవరకూ ఊహాప్రపంచంలో విహరించి పొందిన ఆనందాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ.

శివుడు కూడా ఉత్సాహంగా ఉన్నాడు.

'ఇక్కడికేకద... సరే, ఐతే హోటల్లోకి నడు. నీతో చాలా కథ చెప్పాలి' అన్నాడు శివుడు.

శివుడు గుక్క తిప్పుకోకుండా మట్లాడేస్తున్నాడు. మధ్య మధ్య తను చెప్పబోయే విషయాన్ని తల్చుకుని తనే పగలబడి నవ్వుతూ ఒక విధమైన తన్మయతలో ఉన్నాడు.

శేఖరం విస్తుపోయి వింటున్నాడు. శివుడు చెపుతున్న విషయాలన్నీ తు. చ. తప్పకుండా ఇంతవరకూ తనకు, దుర్గకు మధ్య నడిచినవే!

శేఖరానికి నమ్మశక్యం గాకుండా వుంది—

మళ్ళీ ఒక అనుమాన మొచ్చింది—దుర్గ, సీత, కూడబలుక్కుని ఇద్దరూ ఒకేవిధంగా ఇలా ప్రవర్తిస్తున్నారేమో నని. కాని, ఒక వేళ వాళ్లిలా నాటకం ఆడుతున్నా, శివుడు, తను మాత్రం అనుకోకుండా ఇలా ఒకేవిధంగా ప్రవర్తించటం విచిత్రాతి విచిత్రమైన విషయం అనుకున్నాడు.

'దీన్ని కథ అంటే ఎవరూ నమ్మరు... వాస్తవికమంత ఆశ్చర్యకరంగా ఉంది!' శివుణ్ణి సరిదిద్దాడు శేఖరం, అంతా విని.

నిన్న గాక మొన్న టిదాకా తనతో గిల్లికజ్జా లాడిన సీత అప్పుడే ఎంత జిత్తులమారిగా మారిందో!—అనుకున్నాడు శేఖరం తన చెల్లెల్ని గురించి.

శేఖరాన్ని మరోక సమస్య బాధించిం దిప్పుడు—తనొక చీరకొంటే ఏమి సరిపోతుంది? మరి సీతకో! ఒక చీర పట్టుకెడితే దుర్గ కట్టుకోక పోవచ్చు—సీతకి పెడతానని తప్పకుండా అంటుంది.

తనిప్పుడు రెండుచీరలు ఎలా కొనగలడు? అంతా అయోమయంగా ఉంది శేఖరానికి.

శివుడు వేడివేడి కాఫీ సాసర్లో పోసుకుని ఊదుకుంటూ ఆదరాబాదరా తాగుతున్నాడు. వాడి ఉత్సాహాన్ని బట్టి చూస్తే వాడి దగ్గిర డబ్బు ఉండి ఉంటుందను కున్నాడు శేఖరం.

ఇంతలో శివుడే, 'నీదగ్గరేమైనా డబ్బుంటే సర్దుతావ్రా బావా! పండగ వెళ్లి గానే ఇచ్చేస్తాను.' అన్నాడు. తన మనసులో మాటలు గ్రహించినట్లు. శివుడు ఈ ఎదురు అప్పడిగేసరికి శేఖరం తృళ్లిపడ్డాడు.

తను అప్పు అడిగి పోకుండా వాడు వేసిన ముందరికాళ్ళ బంధం ఇది అనుకున్నాడు శేఖరం. శేఖరం దృష్టి శివుడిలాల్చీ జేబు పైకి మళ్లింది. ఎంత ఎత్తుగా ఉందో—అనుకున్నాడు.

శివుడు ఇంకా సాసర్లో కాఫీ ఊదుకుంటూనే ఉన్నాడు.

అతి నైపుణ్యంతో శివుడి జేబులోకి చెయ్యి పోనిచ్చాడు, శేఖరం. పర్సు బైటికి లాగటం కూడా పూర్తయింది లిప్తపాటులో, చల్లగా బల్లకిందనించి తన లాల్చీ జేబులోకి చేర్చాడు పర్సుని తన హస్తలాఘవాన్ని తనే మెచ్చుకుంటూ.

ఇద్దరూ కుర్చీల్లోనుంచి లేచారు. బిల్లు చెల్లించటానికి శివుడు పర్సు తీయవలసిన అవసరం రాకుండా శేఖరమే చెల్లించాడు.

శివుణ్ణి వదుల్చుకుని తొందరగా అవతల పడాలను కున్నాడు. శివుడుకూడా శేఖరాన్ని వదిలి హడావిడిగా వెళ్లిపోయాడు.

శివుడు కనుమరుగవగానే శేఖరం పర్సుతీసి చూచాడు. యాభై రూపాయలతో పాటు కొంత చిల్లరకూడా ఉంది!—

పండగ పబ్బం గడుస్తుందిగదా, అని సంతోషించాడు శేఖరం. కాని, తను చాలా దారుణమైన పనిచేశాననుకున్నాడు, మళ్ళీ.

పండగ వెళ్లగానే అప్పు తీర్చినట్లు వాళ్ల యాభైరూపాయలూ శివుడికిచ్చేదాము లెమ్మనుకుని సంతృప్తి పొందాడు. తనైనా ఇప్పుడు చీర కొనబోతున్నది తన చెల్లెలు సీతకోసమే నాయె! శివుడైనా భార్యకి చీర కొందామనే తెచ్చిఉంటాడు కూడాను.

వాళ్లు డబ్బు పోయిందని నొచ్చుకుంటుండగా తను చీర పెడితే వాళ్ళంతా మరింత ఆశ్చర్యపడుతారను కున్నాడు శేఖరం.

కొట్లోకి వెళ్ళటమే తడవుగా రెండు చీరలు కాగితంలో కట్టించి జేబుల్లోకి చేతులు పోనిచ్చాడు శేఖరం.

తన మనీపర్సు లేదు!

బుఱ్ఱ ఖాళీ అయిపోయినట్లనిపించింది.

చివరికి ఒక్క చీరమాత్రమే కొని, బజారంతా పర్సుకోసం మరోకసారి గాలించి ఇల్లుచేరాడు శేఖరం. మరోక చీర కొనదగ్గ డబ్బు తను వృధాగా పోగొట్టానని మనసు కలకించ పడుతోంది. గదిలో ప్రవేశించి చీరను బీరువాలో పెడదామని బీరువా తెరిచాడు—

తను బాగుం దనుకున్న మాటు అందులో ఉంది!

అనుకున్నంతా చేసితీరిందన్న మాట దుర్గ. కాని ఎలా కొనగలిగిందో—పెట్టెలో డబ్బు తను తీసేలాడాయె. శేఖరాని కేమీ పాలుపోలేదు.

ఏమీ ఎరగనట్టు బీరువాతలుపులు మూసి, తను తెచ్చిన చీర మంచంపైన పడేసి కుర్చీలో పడుకున్నాడు.

దుర్గ చరచరా గదిలో ప్రవేశించింది. 'నేను బట్టలు కొనుక్కోవాలి, డబ్బుంటే ఇమ్మని దొరలాగా అడిగి పుచ్చుకోక వాళ్ళకి పెట్టెలు పగలగొట్టే దొంగ బుద్ధేమిటి?' తన కోపమంతా అభినయంలో చూపించింది.

తనకి బట్టలుకొని, తను చీరే కొనిఉంటాడన్న నమ్మకం కూడా ఉండి దుర్గ ఇలా అలుగుతుంటే శేఖరానికి పెద్దగా నవ్వ బుద్ధయింది.

తను పారేసుకున్నా ననుకుంటున్న యాభైరూపాయల విచారం ఇట్టే మరచిపోయాడు. 'నేను చీర కొనుక్కోవాలి డబ్బుంటే ఇవ్వండని దొరసానిలాగా అడిగి పుచ్చుకోతగ్గ దానికి జేబు దొంగతనాలు చేసేబుద్ధేమిటో!' శేఖరం మళ్లీ వాయనం తప్పచెప్పాడు.

అనవసరంగా తనకి స్వార్థం అంటగడుతున్నట్లు కోపం ముక్కుపైకి తెచ్చుకుంటూ 'అనండి—మీ ఇష్టమొచ్చినట్లు. నేను చీర కొనుక్కోటానికి డబ్బు దాచుకుంటే ఆ పాపమంతా నాది... మహా నరకాన పడతాను' అంది దుర్గ.

'నేను కూడా అంతేనా?' అన్నాడు శేఖరం.

ఈ ప్రశ్నకి అంతేనని సమాధాన మివ్వటానికి ఎందుకో భయపడింది దుర్గ.

'అంతే నన్నమాట!' రెట్టించాడు శేఖరం.

'ఆ మాట నే నన్నానా?' అంది దుర్గ కళవళపడుతూ.

దుర్గ అమాయకత్వానికి శేఖరం ఒక్క పెట్టున నవ్వాడు. 'పోనీ, నాకు బట్టలుకొందామనే నువ్వు డబ్బు దాచిఉన్నట్లయితే నీకు పుణ్యముండి, స్వర్గానికి వెడతావన్నమాటేగా?' అన్నాడు శేఖరం.

'ఏమో, నాకు తెలీదు' అంది దుర్గ ముభావంగా.

'ఇది, ఇందాక నువ్వన్నమాటేగా!' అన్నాడు శేఖరం.

తర్కంతో సంభాషణని విపరీతమైనదారులు తొక్కించగలడు తన భర్త అనుకుంది దుర్గ. 'స్వర్గానికి అక్కర్లేదు. మరెక్కడికీ అక్కర్లేదు ఉన్నట్లుండ నివ్వండి' అంది భర్త తెచ్చిన పొట్లం విప్పుతూ.

తన చీర!—

'ఇదా రహస్యం!—మీరు స్వర్గానికి టిక్కెట్టు తెచ్చుకున్నారేం!—అప్పుడు కూడా మాపోటి పాపుల్ని కనికరించండి' అంది సానునయంగా.

'అంత విచారం అనవసరం...సహగమనం చేద్దాం—నీ టిక్కెట్టు కూడా బైటికి తియ్యి—బీరువాలో ఉంచి మరిచిపోయినట్టున్నావ్.'

బీరువా తెరిచి తన సూటుతీసి మంచంపైన పడేశాడు.

ఇద్దరూ మాటా పలుకూ లేకుండా క్షణంపాటు గడిపారు. దుర్గ ఏదో దీర్ఘంగా ఆలోచిస్తోంది.

'ఏమిటి ఆలోచిస్తున్నావ్?' అన్నాడు శేఖరం.

'పండగపూట చాలా సంతోషంగా ఉందికదూ?' మెల్లగా అంది దుర్గ శేఖరం కళ్ళలోకి చూస్తూ.

దుర్గ పెదవులుకావు, హృదయం అంటోంది ఈ మాటలు అనుకున్నాడు శేఖరం.

'నీకు మాత్రం అనిపించటంలేదూ?' అన్నాడు సానునయంగా.

'ఔను, అనిపిస్తోంది' అంది దుర్గ తలవంచి.

దుర్గ మళ్లీ మౌనముద్ర పట్టింది. దుర్గ ఇంకా అలా మాట్లాడితే బాగుండు ననుకున్నాడు శేఖరం.

'ఏమిటాలోచిస్తున్నావు? మాట్లాడు దుర్గా!' అన్నాడు దుర్గ తలపైకెత్తి కళ్ళలోకి చూస్తూ.

దుర్గని ఎక్కడలేని సిగ్గూ ఆవహించింది. ఇంతకుపూర్వం తను ఆవేశంలో ఏమేమో మాట్లాడేశానని, అది ఆవేశమన్న విషయం భర్తకు తెలిసిపోయిందనీ లజ్జపడ్డది.

'సీతావాళ్ళు ఏం చేస్తున్నారో! తను కూడా చీర కొనుక్కుందేమో?' అంది విషయం మార్చి.

'కొనుక్కునే ఉంటుంది. ఇందాక మీ తమ్ముడు బజార్లో కనిపించాడు చీర కొనటానికివచ్చి' అన్నాడు శేఖరం.

శివుడి జేబులో డబ్బు తను కాజేస్తే, వాడు సీతకి చీ రెలా కొనిఉంటాడని శేఖరాన్ని అంతరాత్మ చెంపదెబ్బ కొట్టింది. ఇంతకింత, వాళ్ళని సంతోషపెట్టబోయి, వాళ్ళ సంతోషాన్ని తను పూర్తిగా పాడుచేశానని బాధపడ్డాడు శేఖరం.

'వాళ్లు కూడా బట్టలు కొనుక్కొని ఉంటే కొనుక్కొని ఉంటారు. ఇద్దరూ మన తోబుట్టినవాళ్లు. వాళ్లకి పండక్కి మనం బట్టలు పెట్టి సంతోషపెట్టాలికదూ?'

ప్రశ్నలోనే తను చెప్పవలసిన సమాధానమేదో ఇమిడ్చి దుర్గ ఇలా అనేసరికి, 'ఔను. పెట్టవలసిందే.' అనటం తప్పితే మరేమీ చేయలేకపోయాడు శేఖరం.

వాళ్లు బట్టలు కొనుక్కున్నారన్నా తను బట్టలు పెట్టి వాళ్ళని సంతోషపెట్టా లనుకుంటున్న దుర్గకీ, వాళ్లు బట్టలు కొనుక్కోగల అవకాశం చెడగొట్టి కేవలం సమాధానంగా మాత్రం—బట్టలు పెడదాము—అంటున్న తనకీ మధ్యనున్న అంతరువు గ్రహించి కలవరపడ్డాడు శేఖరం.

శివుడి జేబులో పర్సు కొట్టేసి, తను మంచి ఉద్దేశించి అనుకోకుండా వాళ్ళకి చెరుపు ఎలాచేశాడో దుర్గముందు వెళ్ళబోశాడు శేఖరం.

'సాధారణంగానే, మనం వాళ్లని సంతోషపెట్టాలి. అలాటిది, ఇంత జరిగినప్పుడు తప్పకుండా ఈ బట్టలు వాళ్ళకే పెట్టాలి.'

ఈ విషయంలో తుదినిర్ణయమిచ్చే అధికారం తనకు వదలలేదు దుర్గ అనుకున్నాడు శేఖరం.

ఈ తర్జనభర్జనలో...సీత, శివుడు గదిలో ప్రవేశించి ఎదట నిలబడ్డ క్షణానికి కాని ఇద్దరూ గమనించలేదు.

'వెయ్యేళ్లాయుస్సక్కా! ఇప్పుడే నీమాట అనుకుంటున్నాం' అన్నాడు శేఖరం.

దుర్గ బట్టలు తెచ్చి టీపాయ్‌మీద పెట్టి, 'ఇవ్వి పట్టుకొద్దా మని ఇప్పుడే అనుకుంటున్నాం' అంది నవ్వుతూ.

'సరిపోయింది! మీరు పట్టుకొద్దా మనుకుంటున్నారు; మేము

కట్టుకురానే వచ్చాం!' అన్నాడు శివుడు చేతులో పొట్లం వాటి ప్రక్కన పెడుతూ.

శివుడి మాటల నందుకుని సీత కళ్లు పెద్దవిచేసి ఎర్రవారగా 'ఎలాగైతేనేం, తెచ్చారురా అన్నయ్యా! ఇంతలావు బహుమతి... నీ డబ్బెట్టి!' అని దుర్గతో, 'చూశావు వదినా! మీ తమ్ముడి బుద్ధిమంతనం...జేబు దొంగతనాలు మొదలెట్టారు!' అంటూ చేతిలో పర్సు ముందుంచింది.

శేఖరం మనీపర్సు!

'వాడ్నే అనవలసిన పనిలేదు. మీ అన్నయ్య బుద్ధిమంతనం కూడా అంతంత మాత్రంగానే వుంది. చూపిస్తానుండు...' అంది దుర్గ సీతని మించి అభినయిస్తూ.

'ఐతే, నా పర్సు నువ్వు కాజేశావుట్రా!' అన్నాడు శేఖరం తబ్బిబ్బౌతూ.

'ఏం? నా పర్సు నువ్వు కాజెయ్యలా!' తప్పుకెప్పాడు శివుడు.

'ఇంతకీ నా పర్సు నువ్వు కాజేశావని నీ పర్సు నేను కాజేశానా, లేక, నీ పర్సు నేను కాజేశానని నా పర్సు నువ్వు కాజేశావా?' అన్నాడు శేఖరం తెప్పరిల్లుతూ.

'ఎలా అయితేనేం. ఇద్దరి పర్సులూ ఇద్దరమూ కాజేశాం' మొన్న చెప్పింది సశేషం. ఇప్పుడు ముగిస్తా విను......'

శివుడు ఖులాసాగా ఉపక్రమించాడు—నలుగురూ కబుర్లలో పడ్డారు.

ఇక్కడ జరిగిన విషయాలన్నీ శివుడు దివ్యదృష్టితో చూచి అదే తిరిగి తనకు చెపుతున్నాడేమో ననుకున్నాడు శేఖరం.

అక్కడిక్కడి సంఘటనలకి గల సామ్యం గ్రహించి నలుగురూ విస్తుపోయారు.

'ఇంతకీ, అబ్బాయిలు పండగంతా దొంగతనాలతో గడిపారు!' అంది సీత నవ్వుతూ.

'మీరో!' ఒకళ్ళని మించిన ఆత్రంతో ఒకళ్లు అన్నారు శివుడు, శేఖరం.

'మేము బహుమతు లిచ్చుకోవాలని దాచుకున్న డబ్బు మీరెలాగో కాజెయ్యక పోరనే మేము దొంగతనాలు చేశాం. మే మనుకున్నట్లుగానే మీరు పెట్టెలు పగలగొట్టారు. చివరికి, మీలో మీరే దొంగతనాలు చేసుకున్నారు!' అంది సీత.

నిన్న మొన్నటి సీత ఎంత సునిశితంగా మాట్లాడేస్తోందో— అనుకున్నాడు శేఖరం.

'మేము దొంగలమే! ఒప్పుకుంటున్నాం......దండించవచ్చు!', అన్నాడు శేఖరం ముద్దాయిలాగా.

'ఐతే, మేమూ ఒప్పుకుంటున్నాం—మేము తోడుదొంగలమనీ, దండించబోమనీ!...'

నలుగురూ గలగలా నవ్వుతున్నారు.

—మమ్మల్ని పూర్తిగా మరిచిపోయారు.

ఔను. వ్యక్తిత్వాల కోసమై మేము వెలిబుచ్చే ఆవేదన వాళ్ల నవ్వుల గలగలలో కరిగిపోకుండా ఎలా ఉండగలదు?

ఈ సంతోష సమయంలోనే రవ్వంత మమ్మల్ని కథ కెక్కించమని శేఖరాన్ని వేడుకుంటే ఒప్పుకోక పోడేమోనని పించింది నాకు. విపరీత మేమిటంటే—బావకూడా తన విషయం, మా విషయం పూర్తిగా మరిచిపోయి నట్లున్నాడు. వాళ్ల సంతోషంలో లీనమై అదేపనిగా నవ్వుతున్నాడు.

'వదినా! మన కథ శేఖరాన్ని వ్రాయమని అడగమను అన్నయ్యని...'

అక్కకికూడా చాలా కోపంగా ఉంది. 'బావకూడా మన్ని మరిచిపోతున్నాడు. తన కెందుకింత సంతోషం' దబ్లీ పొడిచింది.

ఇక నేను ఉండపట్టలేక పోయాను. 'బావా! మనకి పాత్రలగౌరవం ఇప్పించమని శేఖరాన్ని అడగరా!' అన్నాను.

బావ నామాటలు ఖాతరు చేసినట్లు లేదు.

వాళ్లు నలుగురూ ఏదో పరిహాస మాడుకుని పగలబడి నవ్వారు.

బావకూడా వాళ్ళనుమించి నవ్వుతున్నాడు.

'బావా!' అరిచాను కోపమంతా కంఠంలోకి తెచ్చుకుని.

'ఉండరా!' అన్నాడు బావ చికాకుగా.

'మనమున్న పరిస్థితులు తెలిసుండికూడా అంత నవ్వెలా వస్తోందిరా నీకు?' అన్నాను.

'నవ్వెలా రావటమేమిటిరా! ప్రాణం ఉక్కిరి బిక్కిరౌతోంది—చూడరా! ఇదంతా నేను కథ వ్రాద్దామనుకున్నాను. కాని, ఇదంతా వీళ్ళ జీవితంలో నిజంగానే జరిగిపోతోంది! నమ్మశక్యం గాకుండా ఉంది!' వెల్లువలాటి మరోక నవ్వు నవ్వాడు బావ, వాళ్ళతోబాటు.

శేఖరం—దుర్గ, శివుడు—సీత... వీళ్ళ నలుగురి జీవితాలు కట్టుకథలంత ఆశ్చర్య జనకంగా, స్వప్నాలంత మనోహరంగా గడిచిపోతున్నాయన్న మాట!

మాస్థితి తల్చుకుని విచారించకుండా ఉండలేకపోయాను.

నిజంరా బావా! ఇదంతా నేను కథ వ్రాద్దామనుకున్నాను. కాని, ఆ కథే వాస్తవమై కూర్చుంది. పోనీలే, నేను కథ వ్రాయలేక పోయానన్న విచారం లేదు నాకిప్పుడు' అన్నాడు బావ.

'ఏం?' అన్నాను బావ పడుతున్న సంతృప్తికి ఆశ్చర్య పడుతూ.

'నేను కథ వ్రాయాలనుకున్నదంతా యదార్థమై కూర్చుంది! కట్టుకథ లక్షణాలు దానికి వశించినై!' అన్నాడు, ఈ మాటలన్నా కాస్సేపుకూడ వాళ్ళతో కలిసి ఆనందించనీకుండా నేను అడ్డ ప్రశ్నలు వేసినందుకు చికాకుపడుతూ.

'ఇలా సమాధానం చెప్పుకుని, నీ కథలు వ్రాయలేని తనాన్ని కప్పి పుచ్చుకోవాలని చూస్తున్నావు' అన్నాను.

'అలా అనుకోవటంలో నీకు తృప్తి ఉంటే, సరే, అలాగే అనుకో. నాకేమీ అభ్యంతరం లేదు' అన్నాడు బావ, నీతో వాదించటానికి నాకు ఓరిక లేదన్నట్లు.

'చాలించండి. వాదనలతో నిజమెప్పుడూ బైటపడదు! నిజం చెప్పు బావా!—ఒక వేళ నువ్విప్పుడు కథ వ్రాయాలనుకుంటే వ్రాయగలవా?' సూటిగా ప్రశ్నించింది అక్క.

బావ మౌనం వహించాడు.

'తెలిసింది. వదినా! అన్నయ్య కథ వ్రాయాలనుకున్నా వ్రాయలేడు. పైగా, అన్నయ్య కథ వ్రాయకపోయినా ఇప్పుడు వాళ్ళకు చింత లేదు!'

'కాని, మనకుందిగా—చింత! మన మెవరమిప్పుడు? వ్యక్తిత్వం లేకపోయినా, కథలో పాత్రలమన్నా గాదో!'

అక్క ఈ మాటలు విసేసరికి మేమంతా ఏదో అగాథంలో పడ్డట్లు, ప్రపంచానికి ఇంకా దూరమై పోతున్నట్లు—అనిపించింది.

వాళ్ళతో బాటు బావ మరోకసారి పెద్దగా నవ్వాడు—ఇది మరీ దుస్సహంగా ఉంది.

'బావా! నువ్వు కథలు వ్రాయవలసిన అవసరం, నీ కథలు వ్రాయలేనితనంతో బాటు తీరితే తీరిఉండవచ్చునుగాని, మనం కథలో పాత్రలుగానైనా ఉండవలసిన అవసరం ఉంది మన కిప్పుడు. ఈ సంతోషసమయంలో నువ్వు శేఖరానికి మన కథ వ్రాయమని చెప్పు వింటాడు. నువ్వు చెప్పక తప్పదు' అన్నాను ఒక్క పెట్టున.

బావ మాట్లాడలేదు—నా మాటలు కొంతవరకు పట్టించుకున్నా డనుకున్నాను.

మేమంతా కూడా పదేపదే అడిగాం.

'సరే, అడుగుతాను' అన్నాడు చివరికి.

ఈ మాటలకే, శేఖరం మా కథ వ్రాస్తానన్నంత సంతృప్తి పొందాం.

పండగపూట కొత్తబట్టలతో...ఆత్మసంతృప్తితో వాళ్ళ సంతోషం చెప్పశక్యం గాకుండా ఉంది.

'శేఖరం!' బావ పిలిచాడు ఎట్టకేలకు!

'ఊఁ...'

'ఈ సంతోషంలో ఎలాగో వీలుచూసుకుని మాకు కూడా పాత్రల గౌరవమిస్తావన్న ఆత్మసంతృప్తి రవ్వంత మా కివ్వరా!' బావ వేడుకుంటున్నాడు.

'శ్రుతా! మీ బావకి చెప్పవా?'

దుర్గా! నువ్వు చెప్పదూ...'

'సీతా! నువ్వు కూడా చెప్పవా?'

—మేమంతా కూడా అడిగాం ఒక్క పెట్టున.

వాళ్ళ తరహా చాలా సానుభూతి సూచకంగా ఉంది.

'తప్పకుండా అలాగే ప్రయత్నిస్తాను—ఆత్మసంతృప్తి నివ్వటానికి' అన్నాడు శేఖరం అభయమిస్తున్నట్లు.

—మేము నలుగురం ఆత్మసంతృప్తి పొందినంత ఆత్మసంతృప్తి పొందాం ఈ మాటలకి.

'ఇప్పుడు మీరు సంతోషంగా లేరా?' అన్నాడు శేఖరం.

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పటం కష్టమనిపించింది.

ఆత్మవంచనలతో బ్రతుకు భారమై, ఆత్మహత్యే ఆనందానికి మార్గమనుకుని, చనిపోయి సుఖమనుభవిస్తున్నామని మనఃపూర్వకంగా ఇంతవరకు నమ్మిన మేము సంతోషంగా లేమని ఎలా చెప్పటం?

'సంతోషంగానే ఉన్నాం' అన్నాడు బావ.

'ఐతే, మాతోపాటు నవ్వండి' అన్నాడు శేఖరం.

వాళ్ళ నలుగురితో బాటు మేమూ నవ్వాం—వాళ్ళనిమించి మేము, మమ్మల్ని మించి వాళ్ళు, దిక్కులు పిక్కటిల్లేటట్లు—ధ్వనులు, ప్రతిధ్వనులవలె.

నిజంగా, మేము చాలా సంతోషంగా ఉన్నాం. ఆనందించటంలో ఉన్న ఆనందం అప్పుడే అర్థమౌతోం దనిపించింది.

కాని ఎందుకీ నవ్వు? అనిపించింది మళ్ళీ—

వాళ్ళు నలుగురూ విశాలప్రపంచంలో భాగస్వాములై, అనుభవించి ఆనందిస్తున్నారు. కాని, మేమో! ఏదో అఖాతానికి బైట ఉండి వాళ్ళు నవ్వుతుంటే, మేము అఖాతంలో ఉండి వాళ్ళతో బాటు నవ్వుతున్నట్లనిపించింది.

'నామరూపాలు రెండూ లేని మేము నవ్వితే సార్థకమేమిటి?' అన్నాను: నా గొంతు అఖాతంలోనుంచి వినబడుతున్నట్లుగానే ఉంది.

శేఖరం చాలా క్లిష్టమైన విషయాన్ని వివరించదల్చుకున్నట్లు ముఖం పెట్టాడు—'ఒక్క విషయం—నువ్వు నేవాడివిఉన్నానని ఒప్పుకుంటావా, లేదా?'

మా విషయమల్లా, వేదాంతగోష్ఠిగా మారుతోం దనుకున్నాను. సమాధానం చెప్పటం ఇష్టంలేక మెదలకుండా ఊరుకున్నాను.

శేఖరం మళ్ళీ ప్రారంభించాడు: 'ఉన్నానని ఒప్పుకోవాలి. లేకపోతే ఆత్మవంచన అవుతుంది—నీకు సంబంధించిన నిజాన్ని నీనుంచి కప్పిపుచ్చుకోవాలనుకోవటమే ఆత్మవంచన. వంచింపబడ్డ ఆత్మ పగ సాధించి తీరుతుంది. అదే ఆత్మహత్య.'

ఈ మాటలు చాలా భయంకరంగా వినిపించినై.

ఇంతకూ నేనున్నానా, లేనా? అన్నాను నిక్కిగా.

'తప్పకుండా ఉన్నావు. హత్యచేసి వంచననుంచి తప్పించుకున్నావు. నువ్వుండగా నీపైన కథేమిటి? నువ్వు యదార్థం. యదార్థ విషయాలెప్పుడూ కథలు గావు. సంతోషంగా కాలం వెళ్ళబుచ్చక, కథ లేమిటి? హాయిగా నవ్వు మాతోపాటు. మీరంతా కూడా...'

ఒక్క గుక్కలో చెప్పినదంతా అర్థం చేసుకోలేక పోతున్నాను.

వాళ్ళు నలుగురూ పకపక లాడుతున్నారు.

ఎప్పుడు మొదలెట్టామో మేమూ నవ్వుతున్నాం మరింతగా. ఇంతకు మరింతగా వాళ్ళు నవ్వుతున్నారు.

నాలుగురెట్లు ఎనిమిది గొంతులు నవ్వుతున్నై, దిక్కులు బ్రద్దలయ్యేటట్లు. ఇందులో ధ్వనులేవో; ప్రతిధ్వనులేవో!

—ఇక్కడ మేమంతా కులాసా.

ఈ సమాచారం తెలియచెయ్యటానికే వీలు గాకుండా ఉంది.

శేఖరం వ్రాయడు—

బావ వ్రాయలేడు—